కొను'గోల్‌మాల్'లో దళారులు

- పొలాల దగ్గరే తక్కువ ధరకు కొనుగోలు
- గిట్టుబాటు ధర అందక వరి రైతుల విలవిల
- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సవా లక్ష ఆంక్షలు
- ఇతర జిల్లాలకు తరలిపోతున్న పచ్చి ధాన్యం


విక్రయించేందుకు రోడ్డుపై రైతులు నిల్వ చేసిన ధాన్యం

పొన్నూరు: కూటమి ప్రభుత్వం అన్నదాతలను చిన్నచూపు చూస్తోంది. ఇంత వరకు పంట నష్ట పరిహారాన్ని, రైతు భరోసాను అందించలేదు. నియోజకవర్గంలో వరి కోతలు ముమ్మరమయ్యాయి. వాతావరణంలో మార్పులకు భయపడి అన్నదాతలు యంత్రాలను ఉపయోగించి కోతలు కోస్తున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా ఫలితం లేదు. సవాలక్ష ఆంక్షలు విధించడంతో అన్నదాతలు గత్యంతరం లేక దళారులను ఆశ్రయిస్తున్నారు. కష్టపడి పండించిన వరి పంటను తక్కువ ధరకే కొనుగోలు చేస్తూ రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారు. ధాన్యాన్ని నిల్వ చేసుకునే సౌకర్యం లేక వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకొని తక్కువ ధరకే రైతులు తెగనమ్ముకుంటున్నారు.

దిగుబడులు బాగున్నా ధర లేదు

ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి పంట దిగుబడి ఆశించిన మేరకు లభించింది. ఎకరాకు 40 బస్తాల ధాన్యం పండింది. పొన్నూరు మండలంలో సుమారు 27 వేల ఎకరాల విస్తీర్ణంలో రైతులు వరి సాగు చేశారు. పలు ప్రాంతాల్లో వారం రోజుల నుంచి వరి కోతలు ప్రారంభమయ్యాయి. స్థానికంగా ఉన్న దళారులు రైతుల నుంచి పచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేసి వెంటనే ఇతర జిల్లాలకు లారీలలో తరలిస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించినా అక్కడ కొనుగోళ్లు ఊపందుకోలేదు. కట్టెంపూడి, తొట్టెంపూడి, కసుకర్రు, నండూరు తదితర ప్రాంతాలలో యంత్రాల సాయంతో వరి కోతలు చేపట్టిన రైతులు ధాన్యాన్ని వెంటనే దళారులకు విక్రయిస్తున్నారు. మండలం నుంచి ప్రతిరోజూ సుమారు 10 నుంచి 15 లారీల ధాన్యం ఇతర జిల్లాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. బీపీటీ 5204, ఇతర సన్నరకం ఏ గ్రేడు వరి ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర (75 కేజీల బస్తా) రూ.1,740, బీ గ్రేడు వరి రకానికి రూ. 1,725గా నిర్ణయించింది. అయితే, దళారులు రూ. 1400కు కొనుగోలు చేసి రైతుల్ని మోసం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వీలైనంత త్వరగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కార్యకలాపాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

వ్యాపారులకే విక్రయిస్తున్నాం



ప్రభుత్వానికి విక్రయించాలంటే తేమ శాతం, బియ్యం రకాలు, ఈకేవైసీ వంటి సమస్యలతో ఇబ్బందులు ఉన్నాయి. దీనికి తోడు ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. వ్యాపారులయితే పొలంలోనే ధాన్యాన్ని రూ. 1,400కు కొనుగోలు చేస్తున్నారు. వరి కోతలు పూర్తయిన తరువాత నిల్వ చేసుకునే సౌకర్య లేక గ్రామాల్లోకి వచ్చే వ్యాపారులకే విక్రయిస్తున్నాం.

– రావూరి వాసు, కౌలు రైతు, కట్టెంపూడి

రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు



మండలంలో 27 వేల ఎకరాల్లో వరి సాగయింది. గత శనివారం నుంచి కోతలు ప్రారంభమయ్యాయి. మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలుకు ఏర్పాటు చేశాం. విక్రయించేందుకు వచ్చే రైతుల వివరాలు నమోదు చేస్తున్నాం. ధాన్యం కొనుగోలు ఇంకా ప్రారంభం కాలేదు.

– దేగల వెంకట్రామయ్య, ఏఓ, పొన్నూరు

క్లుప్తంగా

పెదకాకాని ఎంపీడీఓగా పవార్ స్వప్నిల్ జగన్నాథ్



పెదకాకాని: మండల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ట్రైనీ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తెలిపారు. పెదకాకాని మండల అభివృద్ధి అధికారిగా శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. నెల రోజుల పాటు విధుల్లో ఉంటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పవార్ స్వప్నిల్ మాట్లాడుతూ మండల అభివృద్ధితో పాటు చేపట్టాల్సిన పనులు, పథకాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.అనంతరం మండల పరిధిలోని కొప్పురావూరులో నిర్మిస్తున్న మినీ గోకుల్ షెడ్డు, ఉపాధి హామీ పనులు, సీసీ రోడ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమావత్ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ కె. శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన శ్రీమద్భగవద్గీత ప్రవచనాలు



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై నిర్వహిస్తున్న శ్రీమద్భగవద్గీతలోని 11వ అధ్యాయం విశ్వరూప సందర్శనయోగంపైఆధ్యాత్మిక ప్రవచనాలు శుక్రవారంతో ముగిశాయి. కాకరపర్తి వెంకటనారాయణరావు, ప్రమీలాదేవి దంపతుల సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. చిన్మయ మిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి భక్తులకు శ్రీకృష్ణ పరమాత్మ విశిష్టతను వివరించారు.

రేపు డాక్టర్ పట్టాభి కళాపీఠం పురస్కారాలు ప్రదానం

నగరంపాలెం: ఈ ఏడాదికి నవరత్నాలు పేరుతో తొమ్మిది మంది ప్రముఖులను సత్కరించనున్నట్లు డాక్టర్ పట్టాభి కళాపీఠం వ్యవస్థాపకులు డాక్టర్ తూములూరి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల 24న గుంటూరు బ్రాడీపేట 2/7వ అడ్డ రోడ్డులోని సీపీఎం జిల్లా కార్యాలయంలో జరిగే 14వ వార్షికోత్సవ సభలో అవార్డులు ప్రదానం చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఎ.మానస (నాట్యం), డాక్టర్ జి.సమరం (మీడియా), డాక్టర్ కేవీ. అనంతశయనం (సంగీతం), డాక్టర్ వజ్రగిరి జస్టిస్ (చిత్రలేఖనం), డాక్టర్ ఎంబీడీ శ్యామల (కవిత్వం), డాక్టర్ ఎల్.వరలక్ష్మి (పర్యావరణం), జి.రత్నశ్రీ (రంగస్థలం), డాక్టర్ బి.అంజయ్య (వైద్యం), డాక్టర్ సీహెచ్.స్వరాజ్యాలక్ష్మి (విద్య), డాక్టర్ ఝాన్సీ లక్ష్మికి స్త్రీశక్తి అవార్డు ప్రదానం చేస్తామని వివరించారు. ముఖ్య అతిథిగా పద్మశ్రీ అవార్డు గ్రహీత సీవీరాజు, విశిష్ట అతిథులుగా డాక్టర్ జగత్ శ్రీనివాస్, డాక్టర్ సమరం, డాక్టర్ ఎస్‌బీఎస్ నరసింహారావు, జి.రత్నశ్రీ హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. సభా అనంతరం శ్రీ సాయి మంజీర కూచిపూడి నృత్య అకాడమి విద్యార్థినుల నృత్య ప్రదర్శన, సిల్వర్ స్టార్ మిమిక్రీ ప్రదర్శన కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

కొమ్మూరు(కాకుమాను): మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతి రోజు మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఎంఈవో కె.ఎఫ్.కెనడీ అన్నారు. మండలంలోని కొమ్మూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పాఠశాలలోనే భోజనం చేసే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో–2 కె.విజయ్ భాస్కర్ పాల్గొన్నారు.

మధుమేహంపై రేపు అవగాహన సదస్సు

గుంటూరు మెడికల్: ప్రపంచ మధుమేహం నిరోధక మాసం సందర్భంగా ఎస్‌హెచ్ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 24న 'మధుమేహం– ఆహారం –జీవన సరళిలో మార్పులు' అనే అంశంపై అవగాహన సభ నిర్వహిస్తున్నట్లు ఎస్‌హెచ్ఓ అధ్యక్షుడు డాక్టర్ టి.సేవకుమార్ శుక్రవారం తెలిపారు. బ్రాడీపేట 2వ లైనులోని ఎస్.హెచ్.ఓ. బిల్డింగులో ఆదివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నిర్వహించే సభలో హ్యాపీ లైఫ్ క్లబ్, వెల్‌నెస్ కోచ్ కె.శ్రీనివాసరాజు పాల్గొంటారని పేర్కొన్నారు.

జీఎంసీ ఉద్యోగి సస్పెన్షన్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఉద్యోగి ఎల్ నాగేశ్వరావును నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సస్పెండ్ చేశారు. అకౌంట్స్ సెక్షన్‌లో కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లింపుల్లో అవకతవకలకు పాల్పడిన అంశంలో అకౌంటెంట్– 2గా పనిచేసిన (ప్రస్తుతం ఇంజినీరింగ్ సెక్షన్ సూపరింటెండెంట్) నాగేశ్వరరావును సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సమష్టి పోరాటం


సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి సమష్టిగా పోరాడుదామని ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. ఏటుకూరు బైపాస్‌లోని కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గం కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు అబద్ధపు హామీలు ఇచ్చి నేడు ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని తెలిపారు. అక్రమాలకు, అన్యాయాలకు పాల్పడుతున్న వారిపై సోషల్ మీడియాపై అన్యాయంగా అక్రమంగా కేసులు బనాయించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న నిరంకుశపాలనకు అడ్డుకట్ట వేద్దామని పిలుపునిచ్చారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ తన దృష్టికి వచ్చిన పలు అంశాలపై స్పందించి, వారికి అన్ని విధాలా సహకారాలు అందిస్తామని తెలిపారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యకర్తలకు, నాయకులకు వైఎస్సార్ సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సంధ్య

గుంటూరు రూరల్: ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని సెయింట్ ఆన్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య తెలిపారు. మనకు వచ్చే ఆదాయంలో కొంత ఆదా చేసి నగదు వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టినట్టయితే భావితరాలకు ఉపయోగకరంగా ఉంటుందని సూచించారు. శుక్రవారం నగర శివారుల్లోని గోరంట్ల గ్రామంలోగల కళాశాలలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటినుంచి పొదుపు, ఆదాయం, ఆర్థిక పరిస్థితులపై అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. ఆర్థిక నిల్వలు పెంచుకునే ఉపాయాలను ఫైనాన్సియల్ అడ్వైజర్ సుధీర్ భూపతి వివరించారు. ఆర్థిక విలువలు, ఆర్థికంగా ఎదిగేందుకు అవసరమైన ప్రణాళికలు, ఆచరణల గురించి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్. షారోన్‌రోజ్, జె.ప్రమీలారాణి, అంజనాదేవి, జి. సరోజ, షేక్ సుభాని, విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు


రైతుతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఏవో

అప్పాపురం(కాకుమాను): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసిన రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించుకుని ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని తహసీల్దార్ వెంకటస్వామి సూచించారు. మండలంలోని అప్పాపురం, చిన కాకుమాను గ్రామాల్లో యంత్రాల వరి కోతలను శుక్రవారం ఏవో కిరణ్మయితో కలిసి ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి గ్రామ రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.ఏవో కిరణ్మయి మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని 17 శాతం లోపు తేమ శాతం ఉండే విధంగా ఆరబెట్టుకోవాలని సూచించారు. కామన్ రకం ధాన్యానికి ప్రభుత్వం క్వింటాకు రూ.2,300,ఏ రకం ధాన్యానికి రూ.2,320 ప్రకటించినట్లు ఆమె తెలిపారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని రైతులతో మాట్లాడి పలు సూచనలు చేశారు.

పెదకాకానిలో..

మండలంలోని అన్ని గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి పి. సంధ్యారాణి తెలిపారు. మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యాన్ని అమ్ముకోవాల్సిన అవసరం లేదని ఆమె రైతులకు సూచించారు. వరి కోత పూర్తి కాగానే ఏరియాలో ఉన్న రైతు సేవాకేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆమె తెలిపారు. తేమశాతం 17 శాతం కన్నా తక్కువ ఉన్నట్లయితే వెంటనే కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు.

పొన్నూరులో..

ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని, దళారులను నమ్మి తక్కువ ధరకు విక్రయించి మోసపోవద్దని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ సూచించారు. మండలంలోని మునిపల్లె, వెల్లలూరు గ్రామాల్లో శుక్రవారం శుక్రవారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతులకు గిట్టుబాటు ధరలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన 7337359375 నంబర్‌కు నెంబర్‌కు హాయ్ అని రైతులు వాట్సాప్ చేస్తే.. ధాన్యం అమ్మకానికి స్లాట్ బుక్ అవుతోందని తెలిపారు. ఏఓ వెంకట్రామయ్య మాట్లాడుతూ మండలంలోని 22 రైతు సేవా కేంద్రాలతో పాటు క్లస్టర్ గ్రామాలైన పచ్చల తాడిపర్రు, పొన్నూరు, మునిపల్లె, పెదపాలెం, చింతలపూడిలో టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, హెల్పర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు.

చికిత్స పొందుతూ ఎలక్ట్రీషియన్ మృతి

ప్రత్తిపాడు: ప్రమాదవశాత్తూ వాహనం పైనుంచి కిందపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఎలక్ట్రీషియన్ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన కొరిటాల రాధాకృష్ణ ఎలక్ట్రీషియన్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె నాగవర్ధిని గర్భిణి కావడంతో గుంటూరులోని మీనాక్షి ఆస్పత్రిలో చేర్పించారు. భార్యను కూతురి వద్ద వదిలిపెట్టి వచ్చేందుకు ఈ నెల 20న రాధాకృష్ణ ఆమెతో ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడ వదిలిపెట్టి తిరిగి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయల్దేరాడు. ప్రత్తిపాడు మండలం బోయపాలెం సమీపంలో మోటార్ సైకిల్ స్కిడ్ అయ్యి రాధాకృష్ణ కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుంటూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున కన్నుమూశాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె. నాగేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మండలాన్ని అభివృద్ధి పథంలో నడపాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు

కాకుమాను: ప్రజాప్రతినిధులు,అన్ని శాఖల అధికారులు కలిసికట్టుగా పనిచేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీపీ రామినేని శ్రీనావాసరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో యుగకీర్తి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీపీ రామినేని మాట్లాడుతూ మండల అభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు,అధికారులు పని చేసినప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన తెలిపారు. జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం మాట్లాడుతూ మండలంలోని జిల్లా పరిషత్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామని ఆమె తెలిపారు.గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని చెప్పారు. సమావేశంలో ఎంపీడీవో మండల ఉపాధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాతీయ హ్యాండ్ బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులతో హెచ్‌ఎం ఏడుకొండలు, వ్యాయామ ఉపాధ్యాయులు

చేబ్రోలు: హ్యాండ్‌బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన చేబ్రోలు మండలం నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎం. ఏడుకొండలు శుక్రవారం తెలిపారు. అక్టోబర్ 26వ తేదీ నుంచి 28 వరకు తెనాలి రాష్ట్రస్థాయి అండర్– 14 స్కూల్ గేమ్ ఫెడరేషన్ హ్యాండ్ బాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఇందులో గుంటూరు జిల్లా జట్టు అద్భుతమైన ప్రదర్శన చేసి ప్రథమ స్థానంలో నిలిచింది. దీనిలో నారాకోడూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతికి చెందిన వి. హరీష్, వై. అనీల్, 8వ తరగతికి చెందిన పి. కార్తీక్‌లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ ముగ్గురు ఈ నెల 25వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తారని హెచ్‌ఎం తెలిపారు. విద్యార్థులను విద్యా కమిటీ చైర్మన్ వి. మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

అంగన్‌వాడీల ఆకలి కేకలు

- మూడు నెలలుగా అందని వేతనాలు
- ప్రత్తిపాడు ప్రాజెక్టులో దుస్థితి


అంగన్‌వాడీ కార్యకర్తలు (ఫైల్)

ప్రత్తిపాడు: అంగన్‌వాడీల ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. మూడు నెలలుగా వేతనాలు అందక నానా ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రమంతటా సకాలంలో వారి ఖాతాలకు జీతాలు జమ అవుతున్నా.. ప్రత్తిపాడు ప్రాజెక్టులోని అంగన్‌వాడీలకు మాత్రం మూడు మాసాలుగా వారి ఖాతాలకు జమకాని పరిస్థితి చోటుచేసుకుంది. ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 226 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిల్లో 226 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 226 మంది అంగన్‌వాడీ హెల్పర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు రూ. 11,500, హెల్పర్లుకు నెలకు రూ. 6,500 చొప్పున వేతనాలను ప్రభుత్వం చెల్లిస్తుంది. అయితే, సెప్టెంబరు నుంచి అందడం లేదు.

బ్యాంకు ఖాతాల్లో తప్పుల కారణాన్ని చూపుతూ..

నెలనెలా సకాలంలో జీతాలు వారి ఖాతాలకు జమ కావాలంటే అంగన్‌వాడీ సిబ్బంది వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతా నంబర్లు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌లను సక్రమంగా సీడీపీవో కార్యాలయానికి అందించాలి. వీరు పీడీ కార్యాలయం ద్వారా బిల్లులు ట్రెజరీకి పంపుతారు.

అయితే, ప్రాజెక్టులో ఉన్న 46 మంది అంగన్‌వాడీలు వారి ఖాతా నంబర్లు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్లు తప్పు ఇవ్వడంతో మొదటి నెల బిల్లులు వెనక్కు వచ్చేశాయి. వాటిని సరిచేసి ఇవ్వాలని మరలా స్థానిక సీడీపీవో కార్యాలయం అంగన్‌వాడీలందరికీ సూచించింది. అయినప్పటికీ కొందరు హెల్పర్లు రెండోసారి కూడా తప్పులను సవరించుకోకుండానే యథావిధిగా వివరాలను సీడీపీవో కార్యాలయానికి సమర్పించారు. దీంతో రెండో నెల కూడా ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌లు తప్పు ఉండటంతో మరలా బిల్లులు రివర్స్ అయ్యాయి. సెప్టెంబరు అక్టోబరు నెలలకు సంబంధించి రెండు జీతాలు ఒకేసారి జమ అవుతాయని భావించిన అంగన్‌వాడీలకు ఈ నవంబరు నెల కూడా కాక పోవడంతో వారి బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. అధికారులు సకాలంలో సక్రమంగా స్పందించి జీతాలు ఖాతాలకు జమ అయ్యేలా చూడాలని కార్యకర్తలు, హెల్పర్లు కోరుతున్నారు.

వేతనాలందక అవస్థలు



జీతాల్లేక అంగన్‌వాడీలు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ప్రాజెక్టు అధికారులు సక్రమంగా, సకాలంలో నెలనెలా జీతాలు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలి. అసలే అరకొర జీతాలతో నెట్టుకొస్తున్న అంగన్‌వాడీలకు ఇలా నెలలు నెలలు బిల్లులు రాకుంటే కుటుంబాలు గడిచేదెట్లా ?

–టి. జ్యోతిరాణి (రాష్ట్ర అధ్యక్షురాలు, ఫోరం ఫర్ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ అండ్ మినీ వర్కర్స్)

ఖాతాల్లో తప్పులే కారణం



అంగన్‌వాడీ సిబ్బంది ఇచ్చిన బ్యాంకు ఖాతాల్లో తప్పులున్నాయి. వారిచ్చిన బ్యాంకు ఖాతాలకు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌లకు తేడా ఉంది. అందుకే రెండు సార్లు బిల్లులు చేసి పంపినప్పటికీ వెనక్కు వచ్చేశాయి. సరి చేసి ఇవ్వాలని చెప్పినప్పటికీ, అలానే ఖాతా నంబర్లు ఇచ్చారు. వచ్చే నెల మూడు నెలల జీతాలు ఒక్కసారే జమ అవుతాయి.

– వి. సుజాతదేవి, (సీడీపీవో, ఐసీడీఎస్ ప్రాజెక్టు, ప్రత్తిపాడు)

మదరసాలో విద్యా సామగ్రి పంపిణీ



గుంటూరు మెడికల్: హోప్ విన్ హాస్పిటల్స్ వ్యవస్థాపకులు, జనరల్ అండ్ లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నజీరుద్దీన్ పుట్టిన రోజు సందర్భంగా మదర్సాలో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఇన్నర్ రింగ్ రోడ్డు రెడ్డిపాలెంలో ఉన్న మానవతా సేవా సమితి, శ్రీరాజేంద్రసూరి జైన్ సేవా సమితి, వయో వృద్ధుల ఆశ్రమంలో అన్నదాన వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో డాక్టర్ షమ సుల్తానా, ట్రామా అండ్ క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ బషీరుద్దీన్, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ జీవీఎస్ రాహుల్ రెడ్డి, జనరల్ మెడిసిన్ అండ్ డయాబెటాలజిస్ట్ డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ ఆనంద్, డాక్టర్ మురళి, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.